క్లుప్తంగా

వైభవంగా ఊంజల సేవ



రేపల్లె రూరల్: పట్టణంలోని ఓల్డ్‌టౌన్‌లోని గ్రామదేవత బూరుగులమ్మ అమ్మవారి తిరునాళ్ల శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి వేకువజామునే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి రజత వస్త్ర, స్వర్ణ ఆభరణాలతో అలంకరించి ఆలయ విశేష పూజా కార్యక్రమాలు, ఊంజల సేవ చేశారు. అమ్మవారిని ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఊయలలో నెలకొల్పి మహిళలు సామూహిక హారతులు పట్టారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు చెల్లించుకుని, మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణంలో లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు మద్దతుగా ప్రచారం



చుండూరు(వేమూరు): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా శుక్రవారం ప్రజాసంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణ మోహన్ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న ఎన్నికల్లో లక్ష్మణరావుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయులు, మేధావులు, నిరుద్యోగులు గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కె. శ్రీమన్నారాయణ, వెంకటరెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు చీరలు వేలం

చందోలు(కర్లపాలెం): స్థానిక బగళాముఖి అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను ఆదివారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. చీరల వేలంలో ఎవరైనా పాల్గొని వేలంపాట ద్వారా కొనుగోలు చేయవచ్చునని చెప్పారు.

కూచిపూడిలో చోరీ

అమృతలూరు(వేమూరు): ఇంటి తాళాలు పగలకొట్టి చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని కూచిపూడి జగనన్న కాలనీలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ జానకి వర్ధన్ తెలిపిన వివరాలు.. జగనన్న కాలనీకి చెందిన నల్లపు గీత, భర్త శ్రీనివాసరావు గురువారం తెనాలి పనికి వెళ్లారు. అదే రోజు మధ్యాహ్నం ఇంటి దగ్గర ఉన్న వాళ్లు చూసి తాళాలు పగల కొట్టి ఉన్నాయ సమాచారం ఇచ్చారు. దీంతో భార్యాభర్తలు ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగల కొట్టి ఇంటిలోని 14 గ్రాముల బంగారు, రూ.50 వేలు నగదు కనిపించడం లేదని అమృతలూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్లు సీజ్

కొల్లిపర: ఎటువంటి అనుమతులు లేకుండా కృష్ణా నదిలో ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను దావులూరు అడ్డరోడ్డు వద్ద శుక్రవారం ఉదయం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రీ ఇసుక విధానం మండలంలోని కృష్ణా నదికి ఆనుకుని ఉన్న వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, కొల్లిపర, హనుమాన్‌పాలెం, అన్నవరం గ్రామాలకు మాత్రమే అనుమతి ఉన్నదన్నారు. మిగిలి ఏ గ్రామానికైనా ఇసుక తరలించాలి అంటే తప్పని సరిగా అనుమతులు ఉండాలని, ఎటువంటి అనుమతులు, వే బిల్లు లేకుండా ఇసుక తరలిస్తే అటువంటి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. సీజ్ చేసిన ఆరు ట్రాక్టర్లను స్థానిక తహసీల్దారు సిద్ధార్థకు అప్పగించగా వాటికి ఆయన వాటికి రూ.10 వేలు చొప్పున ఫైన్ వేసినట్లు తెలిపారు.

హత్య కేసుగా మార్పు

తెనాలి రూరల్: మద్యానికి డబ్బులివ్వలేదని వ్యక్తి పై హత్యాయత్నం చేయగా బాధితుడు మృతి చెందడంతో హత్య కేసుగా పోలీసులు మార్చారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ నాజరుపేటకు చెందిన బసవయ్య అద్దెకు ఆటోలను తిప్పుతుంటాడు. ఇతని వద్ద అంగలకుదురుకు చెందిన అనిల్ ఆటోలు అద్దెకు తీసుకుంటుంటాడు. అనిల్‌తో పాటు ఇస్లాంపేటకు చెందిన జుపల్లి వేణు, అతని స్నేహితుడు రాము గత నెల 31వ తేదీ రాత్రి మద్యం తాగడానికి బసవయ్యను డబ్బు అడుగగా అతను ఇచ్చేందుకు నిరాకరించాడు. తమ వద్ద ఉన్న కత్తితో అతని గొంతుపై పొడిచారు. బాధితుడు చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. బసవయ్య శుక్రవారం మృతి చెందడంతో హత్య కేసుగా మార్చారు.

భార్యాభర్తలకు గాయాలు

తెనాలి రూరల్: రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయాలపాలైన ఘటన మండలంలోని ఖాజీ పేట వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. వినోద్ భార్య దుర్గాభవానితో కలసి నందివెలుగు వైపు నుంచి బైక్‌పై వెళుతుండగా ఖాజీపేట వద్ద కారు ఢీ కొట్టడంతో గాయాలపాలయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ ప్రతాప్ కుమార్ తెలిపారు.

అందని సాగునీరు.. ఎండుతున్న పంటలు

- రైతుల భగీరథ ప్రయత్నాలు
- బోరులు, మురుగుకాల్వలే దిక్కు
- రైతులకు తప్పని అదనపు భారం



నగరంలో రేపల్లె ప్రధాన మురుగుకాలువలో నీటికోసం తవ్విన కాలువ

నగరం: రైతులు పంటను కాపాడుకునేందుకు కష్టాలు పడుతున్నారు. సాధారణంగా డెల్టాలో ఖరీఫ్ మిగియగానే రబీ సాగు చేస్తుంటారు. ఆరుతడి పంటలు సాగు ఆనవాయితీ. పొలాల్లో ఉండే తేమతోపాటు అడపాదడపా కాలువలకు విడుదల చేసే నీటిని వినియోగించుకుని మినుము, తెల్లజొన్న, మొక్కజొన్న పండిస్తుంటారు. ఈ ఏడాది అప్పడే ఎండల ప్రభావంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రబీ సాగు ఇలా..

ఈ ఏడాది రబీలో మండలంలో 28 వేల ఎకరాలలో మినుము, వేరుశనగ, తెల్లజొన్న, మొక్కజొన్న వేశారు. దీనిలో 90శాతం పంటకాలువలలో నీటిపై ఆధారపడి సాగుచేయాల్సి ఉంది. పంటకాలువల్లో నీరు లేకపోవడంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. మండలంలోని మీసాలవారిపాలెం, దాసరిపాలెం, ఈదుపల్లి గ్రామాలలోని రైతులు రేపల్లె ప్రధాన మురుగుకాల్వలో అరకొరగా ఉన్న నీటిని రైతులు పొక్లెయిన్ తవ్విన సమయంలో ఊరిన ఊట నీటిని పిల్లకాల్వలు ఏర్పాటుచేసి డీజిల్ ఇంజన్‌ల ద్వారా ట్యూబుల సహాయంతో పంటలకు రక్షించుకుంటున్నారు. రైతులకు అదనంగా రూ.2500 నుంచి 3000 వరకు ఖర్చు అవుతుందని రైతులు వాపోతున్నారు. పంటపొలాల్లో బోరులు వేయటం, మురుగుకాలువలలో అరకొరగా ఉన్న నీటిని కాలువలు తవ్వి ఆ నీటిని డీజిల్ ఇంజన్లు ద్వారా ట్యూబుల సహాయంతో పంటలకు పెడుతున్నారు.

బోర్లే దిక్కు..

ఆయుకట్టు భూములు (చివరి భూముల) రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోరులపై ఆధారపడి పంటలను రక్షించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈనేపథ్యంలోనే రైతులకు పంటలపై పెట్టుబడి అమాంతం పెరిగింది. బోరుల ఏర్పాటుకు రూ.12,000 నుంచి 15,000 వరకు వెచ్చిస్తున్నారు. తర్వాత మోటార్లు, వైర్లు, ట్యూబులు తదితరు ఖర్చులకు మరో 20 వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. చేసేదిలేక రైతులు పంటలు రక్షించుకునేందుకే అప్పులు చేసి మరి బోరులు దించి మోటార్లుతో నీటిని అందిస్తున్నారు. ఎండల తీవ్రతకు బోరులలోని నీరు చాలకపోవడంతో పంటలు వాడుముఖం పడుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటకాల్వలలో కనీసం చుక్క నీరు లేవని మా బాధలు అర్థం చేసుకుని ఒకతడి నీటిని పెట్టుకునేందుకైనా అధికారులు పంటకాలువలకు పూర్తి స్థాయిలో నీటిని అందించాలని రైతులు కోరుతున్నారు.



మురుగుకాలువలో నీటిని డీజిల్ ఇంజన్‌లతో తరలిస్తున్న వైనం

ఎమ్మెల్సీ ఎన్నికల విధులను సమర్థంగా నిర్వహించాలి

డెప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి



పీఓలు, ఏపీఓలకు శిక్షణనిస్తున్న డెప్యూటీ కలెక్టర్ ఎం.నాగిరెడ్డి

రేపల్లె రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు విధులను అధికారులు సమర్థంగా నిర్వహించాలని డెప్యూటీ కలెక్టర్ ఎం.నాగిరెడ్డి చెప్పారు. పట్టణంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో పీవోలు, ఏపీవోలు, సెక్టారు ఆఫీసర్‌లతో శుక్రవారం నిర్వహించిన శిక్షణ తరగతులలో ఆయన మాట్లాడారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా కృషిచేయాలని చెప్పారు. రేపల్లె సబ్ డివిజన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు 23 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగిందని, వీటిలో రేపల్లె నియోజకవర్గంలో 10 పోలింగ్ కేంద్రాలు, వేమూరులో 14 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద నిర్వహించే 144 సెక్షన్‌ను పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని కోరారు. ఎన్నికలు ఫిబ్రవరి 27వ తేదీ నాటికి 48 గంటల ముందు అభ్యర్థులు ప్రచారాలు నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణలో నిర్వహించాల్సిన విధి విధానాలపై డిప్యూటీ కలెక్టర్ శిక్షణనిచ్చారు. అదేవిధంగా బ్యాలెట్ బాక్స్‌ల ఉపయోగం, సీల్ వేసే విధానంప ఆర్డీఓ రామలక్ష్మి అవగాహన కల్పించారు.

కొనసాగుతున్న శిక్షణ తరగతులు

రేపల్లె రూరల్: పట్టణంలోని మున్సిపల్ హైస్కూలు, ట్రిబుల్ ఎస్ హైస్కూలులో రేపల్లె పట్టణ, మండలంలోని అంగన్‌వాడీలకు పోషణ్ భీ పడాయి భీ అంశంపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారానికి రెండో రోజుకు చేరాయి. సీడీపీఓ సుచిత్ర అంగన్‌వాడీలు నిర్వర్తించాల్సిన విధులు, గర్భిణులు, బాలింతలు, శిశువుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు నాంచారమ్మ, శివజ్యోతి, సునీత, నాగలక్ష్మి, మంజుల, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు

నిజాంపట్నం: మండలంలోని గోకర్ణమఠం అప్పర్ ప్రైమరీ పాఠశాలలో రెండో రోజు మండలంలోని అంగన్‌వాడీలకు పోషణ్ భీ పడాయి భీ అంశంపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారానికి రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సీడీపీఓ ఎం.అనసూయ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించాల్సిన విధులపై అవగాహన కల్పించారు. పిల్లల్లో పోషకాహారం లోపం, చిన్నారులకు తల్లిపాలతో కలిగే ప్రయోజనం, తదితర అంశాలను అంగన్‌వాడీలకు వివరించారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు



జంపనిలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

జంపని(వేమూరు): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యతమైన పౌష్టికాహారం అందించాలని అమృతలూరు సీడీపీఓ జి.విజయలక్ష్మి కోరారు. వేమూరు మండలంలోని జంపనిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఐదు రకాలు పిల్లలను అభివృద్ధి చేయాలని సూచించారు. పిల్లలను మానసికంగా, శారీరకంగా అభివృద్ధి చేయాలని కోరారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వెంకట సురేష్ ఆరోగ్యంపై సూచనలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ అమృతవాణి, మాధవి పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి



సంజీవయ్య చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

బాపట్ల: దళిత తొలి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వివిధ సంఘాల, ఉద్యోగులు, పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పాత మండల పరిషత్ కార్యాలయం దగ్గర ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. రిటైర్డు ఉద్యోగి బండికెళ్ల బాబూరావు మాట్లాడుతూ సంజీవయ్యను ఇప్పుడు ఉన్న తరం ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. రిటైర్డు అధ్యాపకులు గద్దం ఏలియా మాట్లాడుతూ భారత దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా పని చేసి ఓల్డ్ ఏజ్ పెన్షన్ రిటైర్డ్ టీచర్స్ పెన్షన్ బెనిఫిటి సౌకర్యం కల్పించిన మొదటి ముఖ్యమంత్రి అని కొనియాడారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి జి. రాజారావు మాట్లాడారు. కార్యక్రమంలో దానియేల్, ఆనందరాజు, చంద్రబాబు, తమలపాకుల భాస్కరరావు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయటం సరికాదు

అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

బాపట్లటౌన్: కాంట్రాక్ట్ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయటం సరికాదని అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ టీచర్స్ వర్కర్స్ జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఎంటీఎస్ పద్ధతికి ప్రభుత్వం తిలోదకాలు ఇస్తుందన్నారు. అన్ని ప్రభుత్వశాఖల్లో పనిచేసే ఉద్యోగులందరికీ కూడా ఎంటీఎస్ అమలు చేయాలని కోరారు. నాలుగైదు రోజుల క్రితం ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగ వ్యవస్థను రద్దుచేసి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియమించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ ఏర్పాటు చేసి ప్రైవేట్ కాంట్రాక్టర్ల పీడ వదిలించు కోవాలని ప్రభుత్వం చూస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి , ఉప ముఖ్యమంత్రి ఇద్దరు కలిసి ఆప్కాస్ రద్దు చేసే అంశాన్ని ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు వారి సమగ్ర శిక్ష ఉద్యోగులు, కాంట్రాక్ట్ , పాలిటెక్నిక్ లెక్చరర్లు ఇతర కాంట్రాక్ట్ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, అగ్రికల్చరల్ యూనివర్సిటీ సిబ్బంది ఏ కాంట్రాక్టర్ ఉద్యోగి సమస్యలు ఎదుర్కొన్న ఆ సమస్యల్లో జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అగ్రికల్చరల్ యూనివర్సిటీ, ఇతర యూనివర్సిటీలు ప్రభుత్వ శాఖల్లో ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న టైం స్కేల్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని జేఏసీ తరఫున డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మజుందార్ పాల్గొన్నారు.

సమస్య లేకుండా భూ–రీసర్వే నిర్వహించాలి

తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజన సింహా



కుంచవరంలో భూ రీసర్వే ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహా

కుంచవరం(కొల్లిపర): అధికారులు భూ–రీసర్వే నిర్వహించే సమయంలో గ్రామంలో రైతులకు ఎటువంటి సమస్యలు లేకుండా సర్వే నిర్వహించాలని, సర్వే సమయంలో సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహా అన్నారు. మండల పరిధిలోని కుంచవరం గ్రామంలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూ రీ సర్వే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. సర్వే ఏవిధంగా జరుగుతోంది, సర్వే సమయంలో ఆ భూమి యజమానులకు అధికారులకు ముందుగానే సమాచారం అందిస్తున్నారా, లేదా? వెబ్ లాండ్‌లో రైతులు తమ భూములు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ఉన్నారా, ఇంకా నమోదు చేసుకోకుండా ఎవరైన ఉన్నారా అని గ్రామంలోని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ భూ రీ సర్వే అనంతరం సర్వే లో ఎవరికైనా ఎటువంటి సమస్యలు ఉన్నా సమస్యలపై వినతపత్రాలు స్వీకరించి, పరిష్కరించడానికి ప్రభుత్వం 190 రోజులు కాలపరిమితి ఉన్నందున సదరు వ్యక్తులకు నోటీలు అందించి తగు ఆర్జీలు పరిష్కరించవచ్చునన్నారు. గ్రౌండ్ వ్యాలిడేషన్ జరిగే సమయంలో గ్రామంలో ముందుగా గ్రామ సభలు నిర్వహించి రైతులకు సంబంధించిన భూ వివరాలు తెలిపి, వారి సమక్షంలోనే తప్పులు ఉంటే సరిచేయటం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ప్రభుత్వ భూముల రీ సర్వే గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు ఉప్పాల రాజేష్, మండల సర్వేయర్ బి. శ్రీనివాసరావు, వీఆర్వో జానీ భాషా, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి నేడు తెనాలి రాక

శోభాయాత్రకు ఏర్పాట్లు



వివరాలు వెల్లడిస్తున్న మఠం బాధ్యులు

తెనాలి: ఆర్యవైశ్య కులదేవత శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మస్థలమైన పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలోని అఖిలభారత శ్రీవాసవీ పెనుగొండ క్షేత్రానికి పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) ఈనెల 15వ తేదీన తొలిసారిగా తన స్వస్థలమైన తెనాలి రానున్నారు. పెనుగొండ క్షేత్ర వాసవీ శాంతిధామంలో ఈనెల 8వ తేదీన భీష్మ ఏకాదశి రోజున బాల స్వామీజీ పీఠాధిరోహణ చేసిన విషయం తెలిసిందే. అనంతరం పీఠాధిపతి హోదాలో తన ఆధ్యాత్మిక జీవితం ప్రారంభమైన తెనాలిలోని శ్రీవిద్యాపీఠంకు రానున్నారు.

సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీవిద్యా పీఠంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ట్రస్ట్ కార్యదర్శి వివరాలను తెలియజేశారు. 15వ తేదీ సాయంత్రం 4.35 గంటలకు తెనాలి సరిహద్దుల్లో గల శ్రీవరసిద్ధి వినాయక స్వామి విగ్రహం వద్దకు స్వామీజీ చేరుకుంటారు. అక్కడి నుంచి స్వామివారి శోభాయాత్రను ప్రారంభించి, మార్కెట్ మీదుగా గాంధీచౌక్, గ్రంథాలయం రోడ్డులోంచి గంగానమ్మ పేటలోని శ్రీవిద్యాపీఠం చేరుకుంటారని తెలిపారు. సంయుక్త కార్యదర్శి ముద్దా భక్తుని రమణయ్య మాట్లాడుతూ శోభాయాత్రలో సంప్రదాయ మంగళవాయిద్యాలు, కేరళ కళాకారులచే డప్పులతో సహా 500 మహిళల కోలాటం శోభాయాత్రలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం శ్రీవిద్యాపీఠంలో స్వామీజీ అనుగ్రహభాషణ చేస్తారని, భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. సమావేశంలో కోశాధికారి గోపు రామకృష్ణ, కమిటీ సభ్యులు రాజేశ్వరరావు, పెనుగొండ వెంకటేశ్వరరావు, కోన నాగేశ్వరరావు, లోకనాథం పాల్గొన్నారు.

డ్రైవర్లు ఒత్తిళ్లకు లోనైతేనే ప్రమాదాలు

జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్

బాపట్లటౌన్: డ్రైవర్లు మానసిక ఒత్తిళ్లతో వాహనాలు నడిపినప్పుడే ప్రమాదాలు జరుగుతాయని జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో స్కూల్ బస్ డ్రైవర్‌లకు ఉచిత వైద్య పరీక్షలు, రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ ఎస్. విజయమ్మ, జిల్లా రవాణాశాఖాధికారి టి.కె.పరంధామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


హెర్బల్ సోప్స్, కాస్మోటిక్స్‌పై శిక్షణ

బాపట్ల: హైదరాబాద్‌కు చెందిన సీవా ఫౌండేషన్, లక్ష్మీ సోము బ్లిస్ బ్లూమ్ హెర్బల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు హెర్బల్ సబ్బు, లిప్ట్ కేర్ కాస్మోటిక్స్ తయారీపై వారం రోజులు శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ ముగింపు సమావేశంలో అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. సర్దార్ బేగ్, లక్ష్మీ సోము, పారా జ్యోతి, డాక్టర్ లావణ్య చేతుల మీదుగా శిక్షణ పొందిన విద్యార్థినులకు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.నాగమణి, సీడీసీ సభ్యులు డాక్టర్ పి.సి సాయిబాబు పాల్గొన్నారు.

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా కిషోర్‌రెడ్డి

తూములూరు(కొల్లిపర): భారతీయ కిసాన్ సంఘ్ గుంటూరు జిల్లా కమిటీ ఎన్నికల్లో జిల్లా కమిటీ అధ్యక్షుడుగా కొల్లిపర మండలంలోని తూములూరు గ్రామానికి చెందిన కొండా కిషోర్‌రెడ్డిని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు సహదేవరెడ్డి తెలిపారు.శుక్రవారం తూములూరు గ్రామంలోని గంగానమ్మ గుడి ఆవరణలో దుగ్గిరాల, తాడేపల్లి, మంగళగిరి, తెనాలి, కొల్లిపర ఆయా మండలంలోని కిసాన్ సంఘ్ సభ్యులు పాల్గొని జిల్లా కమిటీ ఎన్నిక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం పాటు పడుతున్న సంస్థ భారతీయ కిసాన్ సంఘ్ అని అన్నారు. రైతులు సంఘటితంగా ఉండి తమ సమస్యలపై పోరాడితేనే వాటికి వెంటనే పరిష్కారం లభిస్తుందనారు. ఎక్కువ శాతం సాగునీటి కాలువలు, పంటకాలువలు, డ్రెయినేజీ కాలువలు సరిగా లేనందున పంటలకు సరైన నీరు అందక, వరదలు సమయంలో వరద నీరు బయటకు పోవటానికి సరైన మార్గం లేక పోవటం వలన రైతులు ఎనలేని నష్టం జరుగుతుంది కావున భారతీయ కిసాన్ సంఘ్ తరుపున రాష్ట్ర కమిటీని నియమించి వారి ద్వారా రైతుల అభిప్రాయాలతో కలపి ఒక నివేదిక తయారు చేసి త్వరలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం జిల్లా కమిటీలో ఎన్నికైన అధ్యక్షులుగా కిషోరెడ్డి, గౌరవ అధ్యక్షులుగా భీమిరెడ్డి రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కుర్రే బ్రహ్మరెడ్డి, కార్యదర్శిగా బొమ్ము వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులుగా కుర్రే సుధాకర్‌రెడ్డి, కోశాధికారిగా భీమవరపు బ్రహ్మానంద రెడ్డిలను నియమించినట్లు ప్రకటించి వారిని అభినందించారు. భారతీయ కిసాన్ సంఘ్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు జి.రాంబాబు, రాష్ట్ర సంఘటనా కార్యదర్శి కొండబాబు, ఆకాకిరణ్, వంగా సాంబిరెడ్డి, వింతా వేణుగోపాలరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడు లీలలు మధురం



నగరంపాలెం: సాహితీవేత్త పి.ఎస్.ఆర్.ఆంజనేయ ప్రసాద్ జయంతిలో భాగంగా బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శ్రీకృష్ణ జననంపై ఆధ్యాత్మిక ప్రవచనం శుక్రవారం కొనసాగింది. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమా మహేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రముఖ సాహితీవేత్త ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి ప్రవచనం చేశారు. శ్రీకృష్ణుడి జన్మ వృత్తాంతం, బాలుడిగా ఆయన లీలలు మధురాతి మధురమని తెలిపారు. ఆయన బాల క్రీడలన్నీ దివ్య వైభవాలని పేర్కొన్నారు. పుట్టుకే లేని పరమాత్మ పుట్టినట్లు కనిపించడం ఒక లీల పేర్కొన్నారు. మానవ జాతిని ధర్మమార్గంలో నడిపించేందుకు ఆయన అవతరించాడని తెలిపారు. తనలోనే సమస్త విశ్వం దాగిందని, తల్లికి తన నోటిలో విశ్వరూపాన్ని చూపించిన సన్నివేశం ఇందుకు తార్కాణమని చెప్పారు. కార్యక్రమంలో పి.రవికిశోర్, పి.హైమానంద పాల్గొన్నారు.

పుల్వామా అమరవీరులు దేశానికే ఆదర్శం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనిక సంక్షేమ సంఘం నాయకులు

బాపట్లటౌన్: పుల్వామా అమరవీరులు దేశానికే ఆదర్శనీయమని మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు తెలిపారు. 2019 ఫిబ్రవరి 14న జమ్మూ కాశ్మీర్ లోని పుల్వామా ప్రాంతంలో ఉగ్రవాదుల దాడిలో అశువులు బాసిన 40 మంది వీర జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ శుక్రవారం బాపట్ల పట్టణంలో బ్లాక్ డే ర్యాలీ నిర్వహించారు. సాంబశివరావు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన పుల్వామా అమరవీరులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉగ్రవాదులను మట్టు బెట్టడానికి భారతీయ సేనలకు అత్యుత్తమమైన శిక్షణ కలిగి ఉంటారన్నారు. కార్యక్రమంలో బాపట్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు పుట్టా ఆదిశేషారెడ్డి, సెక్రటరీ షేక్ కరిముల్లా, ఉమ్మడి గుంటూరు జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు సుంకర శేషగిరి రావు, బాపట్ల అసోసియేషన్ ముఖ్య సలహాదారులు షేక్ నిజాముద్దీన్, సీనియర్ మాజీ సైనికులు కృష్ణారావు, వల్లూరి భావన్నారాయణ, కే ఆంజనేయులు, పి రాధా కృష్ణమూర్తి, రుక్మధరరావు, బసివి రెడ్డి, పీతా సారథి పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి

తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా



ఉద్యోగులతో ప్రమాణం చేయిస్తున్న సబ్‌కలెక్టర్ సంజనా సింహా

తెనాలిఅర్బన్: గ్రాడ్యుయేషన్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా పేర్కొన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ గ్రాడ్యుయేషన్ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. పోటీల్లో ఉన్న అభ్యర్థులు ఇప్పటికే నామినేషన్లు వేయడం జరిగిందన్నారు. ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన పోలింగ్ కేంద్రాలను కూడా సిద్ధం చేసినట్లు చెప్పారు. 27వ తేదీన పోలింగ్ జరగనున్నట్లు వివరించారు. ఎన్నికల విధులకు హాజరయ్యేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే ఎన్నికలు జరిగే కృష్ణా–గుంటూరు జిల్లాల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఎన్నికల కమిషన్ నిఘా ఏర్పాటు చేసిందన్నారు. స్క్వాడ్ విధులను నిర్వహించే వారు ఎప్పటికప్పుడు అన్ని విషయాలను అధికారులకు తెలియజేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణ, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సంజీవరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయండి

మెప్మా విభాగ మేనేజింగ్ డైరెక్టర్ భరద్వాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కమిషనర్ శేషన్న, మెప్మా సీఎంఎం విజయ కుమారి

తెనాలిఅర్బన్: స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని మెప్మా విభాగ మేనేజింగ్ డైరెక్టర్ భరద్వాజ్ సూచించారు. తెనాలి మున్సిపల్ అధికారులతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెప్మా విభాగంలో అనేక కొత్త ప్రాజెక్టులను అమలు చేస్తున్నట్లు చెప్పారు. వాటన్నింటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మెప్మా సీఎంఎం విజయ కుమారి, మెప్మా ఉద్యోగులు, ఆర్‌పీలు పాల్గొన్నారు.